సీరియల్

అడుగు ముందుకు వేస్తే భస్మం

వసుంధర

(గత సంచిక తరువాయి)

డాక్టర్ వచ్చేవరకూ రామంకి ఏవో ఊరడింపు మాటలు చెబుతూనే ఉన్నాడు గురువులు. రామం అవి వింటూ బాధ నటిస్తూ సమయం గడుపుతున్నాడు. డాక్టర్ వచ్చి రామాన్ని పరీక్షించి-'ఏమిటో తెలియడం లేదు. అంతా బాగానే ఉన్నట్లుంది. బహుశ అజీర్తివల్ల వచ్చి ఉండాలి. పొట్టచూస్తే అలా అనిపించడంలేదు-' అన్నాడు.

'అబ్బా!' అంటూ రామం మంచంమీంచి ఎగిరిపడ్డాడు.

'డాక్టర్ గారూ-అంతగా అంతుపట్టని రోగంగా మీరు భావిస్తే ఇతన్ని మీఇంటికి పంపిస్తాను. సరంజామా అంతా అక్కడే ఉందిగదా-' అన్నాడు ప్రెసిడెంటు.

'అదే మంచిదనిపిస్తోంది నాకూను....' అన్నాడు డాక్టర్.

గురువులుకు అందులో అనుమానించాల్సిన దుందని పించింది. 'కడుపునొప్పికి ఏదో మిక్స్చర్ ఇస్తే సరి పోయేదానికింత హడావుడి దేనికి? పేషెంటుని డాక్టర్ ఇంటికి తీసుకెళ్ళడమెందుకు?'

'మీఇష్టం. నాసలహా నేనిచ్చాను....' అన్నాడు డాక్టర్.

'నన్ను వెళ్ళనీ గురువులూ. ఈబాధ భరించలేను-' అన్నాడు రామం.

'రామం-నీకుతెలియదు. నువ్వు ప్రమాదంలో ఇరుక్కుం టావు. వీళ్ళు నిన్ను నానుంచి వేరు చేయాలని చూస్తు న్నారు....' అన్నాడు గురువులు.

'ముందీ కడుపునొప్పి నానుంచి వేరుకానివ్వు గురు వులూ'! అన్నాడు రామం. అతనుపొట్ట పట్టుకుని మంచం మీద అంతెత్తు ఎగిరాడు.

'ఇది మిక్స్చర్ కు లొంగే నొప్పికాదు. నిద్రమాత్ర వేసి ఇతన్ని రాత్రంతా పరీక్షించాలి. సరంజామా అంతా ఇంటివద్ద ఉంది. ఇప్పుడిలా ఇక్కడ వదలిపెడితే కోతి పుండు బ్రహ్మరాక్షసి కావచ్చు.....' అన్నాడు డాక్టర్.

'మనిషి ప్రాణాలకంటె ముఖ్యమైన దేముంది? ఈ గురువుల్తో మనకు పనిలేదు. ఇతడు పచ్చిరక్తం కళ్ళ జూసే హంతకుడు. ప్రాణాల విలువ తెలియదు ఈ మనిషి అనుమతితో మనకు నిమిత్తంలేదు. రామాన్ని

మీఇంటికి చేర్చే బాధ్యతనాది!' అన్నాడు ప్రెసిడెంటు.

'నాకు ప్రాణాలవిలువ తెలియనిమాట నిజమే : నేను పచ్చిరక్తం కళ్ళజూసే మాటకూడా నిజమే! రామానికి కించిత్ప్రమాదం వాటిల్లినా ఈరెండు నిజాలు మీరు తెలుసుకుంటారు గుర్తుంచుకోండి-' అన్నాడు గురువులు.

రామానికి కడుపునొప్పి రావడం గురువులుకు నచ్చ లేదు. అదొక అపశకునంగా అతను భావించాడు. తన పథకానికిదో పెద్దదెబ్బ. ఈకారణంగాజరిగే ఆలస్యంమాట టుంచి తనువాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోతున్నాడు. రామం గురించి రామేశానికి తనుహామీ ఇచ్చాడు. ఇప్పుడు రామం ప్రాణాలు డాక్టర్ చేతిలో ఉన్నాయి.

ప్రెసిడెంటు పాలేరు రామాన్ని భుజాలమీద వేసు కున్నాడు. రామం ఉండుండి ఎగిరిపడుతూనే ఉన్నాడు. కానీపాలేరు బలాఢ్యుడు. అతను రామాన్ని అవలీలగా ఎత్తుకుని, డాక్టరు ముందునడుస్తూంటే తను వెనుకగా నడుస్తున్నాడు.

అక్కణ్ణించి వెళ్ళిపోతూ... 'గురువులూ, గుర్తుం చుకో-గడువు రేపు రాత్రి వరకే ఉంది—' అన్నాడు ప్రెసిడెంటు.

గురువులు కోపాన్నీ, ఆవేశాన్నీ నిగ్రహించు కున్నాడు. ముందు ఏంచేయాలాఅని తీవ్రంగా ఆలోచిస్తు న్నాడతను.

* *

'ఎవరది?' అంటూ తలుపులు తీసిన డాక్టర్ గురువుల్ని చూచి ఆశ్చర్యపోయి— 'నువ్వా' అన్నాడు.

"అవును. నేనే! రామానికెలాగుంది?' అన్నాడు గురువులు.

'నువ్వెళ్ళి చూడు—" అన్నాడు డాక్టర్.

గురువులు రామం ఉన్న గదిలోకి వెళ్ళాడు. రామం మంచం మీద ప్రశాంతంగా ఉన్నాడు. అతను మెలకువగానే ఉన్నాడు.

"ఎలా ఉంది?" అనడిగారు గురువులు.

'ప్రస్తుతానికి బాగానే ఉంది. కానీ ఏ మందుకూ లొంగలేదు. హఠాత్తుగా దానంతటదే తగ్గింది. మళ్ళిమళ్ళి రావచ్చునంటున్నాడు డాక్టర్. బహుశా రెండు రోజులు చూసి పట్నం పంపాల్సింటుందేమోనని కూడా అన్నాడు...' అన్నాడు రామం.

'అన్నీ అబద్ధాలు... మందులకే తగ్గుంటుంది.' అన్నాడు గురువులు.

'అలాగే అనుకోవాలని నాకూ ఉంది. కానీ అది భయంకరమైన బాధ. మళ్ళీ వస్తుందని తలచుకుంటేనే నాకు భయంగా ఉంది. పగవాడికి కూడ రావద్దు ఆ బాధ...' అన్నాడు రామం.

"పగవాడికూ్కడా వద్దనుకునే అనుభవాలు చాలా ఉన్నాయీ ప్రపంచంలో. అలాంటి అనుభవాన్నొకటి ఇప్పుడు ఇక్కడ ప్రదర్శించబోతున్నాను. ఓపిక ఉంటే చూడు...." అన్నాడు గురువులు.

రామం ఆశ్చర్యంగా— 'ఏమిటి?' అన్నాడు.

'ఏమిటా— చేసిన పాపం ఏనాటికైనా పండుతుందంటారు. అదేమిటో ఇప్పుడే వీళ్ళలో చూడవచ్చు—' అన్నాడు గురువులు.

రామానికి భయంవేసింది. అతనికి కంగారుకూడా వచ్చింది. గురువులు కానీ తనపథకాన్ని గ్రహించలేదుగదా!

'నీ మాటలు వింటూంటే నాకేదో భయంగా ఉంది-' అన్నాడు రామం.

'నీ తెలివి తేటల్నీ నటననూ నేనభినందిస్తున్నాను రామం. నాతో రా, జరగబోయేది చూద్దువు గాని....' అన్నాడు గురువులు.

తన విషయం గురువులికి తెలిసిపోయిందని రామం గ్రహించాడు. కంగారుపడి చేసేదేముంది? జరగనున్న దెలాగూ జరగక మానదని గురువుల ననుసరించాడు రామం.

డాక్టర్ హాల్లో కూర్చుని ఉన్నాడు. రామం, గురువులు అక్కడకు రావడం చూసి - గురువుల్నుద్దేశించి - "పేషెంటుని కదపడం అష్టేమంచిది కాదు...." అన్నాడు డాక్టర్.

" అ సంగతి నాకూ తెలుసు. కానీ నిన్న ఓ హెచ్చరిక పారేశాను గుర్తుందా? ఆ పని మీదే ఇక్కడకు వచ్చాను. నా క్రియా శూరత్వం ఎలా ఉంటుందో నా స్నేహితుడు తెలుసుకోవాలని ఇక్కడకు తీసుకు వచ్చాను...." అన్నాడు గురువులు.

'ఏమిటి నువ్వనేది?' అన్నాడు డాక్టర్. అతడి ముఖంలో కాస్త కంగారు కనబడింది.

'రామం-నువ్వు వెళ్ళి డాక్టర్ పక్క కూర్చో!' అన్నాడు గురువులు.

రామం వెళ్ళి డాక్టర్ పక్క కూర్చున్నాడు. డాక్టర్ కూర్చున్న చోట్నుంచి కదలకుండా గురువులు వంక

చూస్తున్నాడు. అతడి కళ్ళలో భయం లేదు. నిర్లక్ష్యం ఉంది.

"ఒకసారి నీ పెళ్ళాన్ని పిలు-" అన్నాడు గురువులు.

"ఎందుకు ?" అన్నాడు డాక్టర్.

'చెబుతాను. పిలవడానికి భయంగా ఉందా ?' అన్నాడు గురువులు.

'నా ఇంట్లో నాకు భయమేమిటి ?' అన్నాడు డాక్టర్-అంటూనే అతడు గట్టిగా - 'రమా !' అని పిలిచాడు.

"వస్తున్నా !" అన్న కంఠం వినిపించింది. గురువులు అటుగా చూస్తున్నాడు. ఒక అందమైన స్త్రీ వయ్యారంగా నడుచుకుంటూ వచ్చి గురువుల్ని చూసి ఠక్కున ఆగిపోయింది.

'ఫర్వాలేదు రమా ! ఇలారా-ఆయన మన అతిథి....' అన్నాడు డాక్టరు. అతడి కళ్ళలో నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. అతడి ధైర్యానికి కారణమేమిటా అని ఆలోచిస్తున్నాడు గురువులు.

"నేను నీ అతిథిని కాను...." అన్నాడు గురువులు.

"నా ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కర్నీ అతిథిగా భావించి గౌరవించడం నా సంస్కారం. అది నీకర్థం కాకపోతే నీ కర్మ..." అన్నాడు డాక్టర్.

'అంత మర్యాదస్తుడివా-అయితే కాసేపు నీ పెళ్ళాన్ని నా కిస్తావా?' అన్నాడు గురువులు. ఆ కంఠంలో హేళన లేదు.

'గురువులూ ! మర్యాద నతిక్రమిస్తున్నావు ....' అన్నాడు డాక్టర్.

'మర్యాద నతిక్రమించడం లేదు. నీ పెళ్ళాన్ని పిలవ మని అడిగినదందుకే ....' అన్నాడు గురువులు. అతని కంఠం చాలా తీవ్రంగా ధ్వనించింది.

'పిడుగూ!' అన్నాడు డాక్టర్. అతడలా అన్న రెండు క్షణాల్లో ఆ హాలు అదిరినట్లు తోచింది. ఒక మహాకాయుడు హాల్లో అడుగు పెట్టాడు.

ఆ మనిషిని చూసి రామం అదిరిపడ్డాడు. రాక్షసుల గురించి పురాణాల్లో చదవడమే కానీ ప్రత్యక్షంగా చూసే అవకాశం అతడికి గలగలేదు. కోరలూ, కొమ్ములూ పెడితే ఆ రాక్షసుల కంటే భయంకరంగా ఉంటాడా మనిషి.

'మిష్టర్ గురువులూ! నేనేమీ తెలివి తక్కువ వాణ్ని కాను. అన్నింటికీ సిద్ధపడే నిన్ను లోనికి రానిచ్చాను. ఈ పిడుగుకు ఎదురునిల్చి పోరాడగల మొనగాడీ ప్రపం చంలో లేడు వీడికి రాని విద్యలేదు. తలచుకుంటే మను షుల్ని నల్లుల్ని నలిపినట్లు నలిపేస్తాడు వీడు. కానీ నేను చెప్పినపుడే దేనికైనా తలచుకుంటాడు. నువ్వు ఏమైనా చేయాలనుకుంటే ఒక్క క్షణం ఆలోచించుకో. నీ నిర్ణ యం నాకునచ్చితే మర్యాదగా ఇక్కణ్నించీ, ఆ తర్వాత ఈ ఊర్నించీ పోవచ్చు. లేదా మనిషిని మనిషిలా ఉంచి లోపలి ఎముకలన్నీ నుగ్గు నుగ్గు చేసేస్తాడీ పిడుగు. ఆలో చించుకో...' అన్నాడు డాక్టర్.

గురువులు ఒక పర్యాయం పిడుగువంక చూశాడు. ఒక పర్వతంలా కనబడుతున్నాడు వీడు. పొరపాటున వాడు తనపై పడ్డాడా-నిజంగానే నుగ్గునుగ్గయి పోతాడు.

'పోవడానికి నాకు అభ్యంతరం లేదు డాక్టర్. కానీ

ఒక్కసారి నీ పెళ్ళాన్ననుభవించనిస్తే మళ్ళీ ఈ ఊరి జోలికి రాను...' అన్నాడు గురువులు.

డాక్టర్ ముఖం బాగా ఎర్రబడింది — "పిడుగును చూసే అంటున్నావా ఈ మాటలు...' అన్నాడు.

'పిడుగు సంగతి నీకు తెలుసు. కానీ నా సంగతి నా కొక్కడికే తెలుసు....' అన్నాడు గురువులు.

రామం ఆశ్చర్యంగా గురువుల్నీ, పిడుగునూ మార్చి మార్చి చూస్తున్నాడు. వాళ్ళిద్దర్నీ చూస్తుంటే అతనికి గుండెలదుర్తున్నాయి. పిడుగులాంటి రాక్షసుణ్ణి చూసి భయ పడని గురువుల్ని మూర్ఖుడనుకోవాలో, ధైర్యవంతుడను కోవాలో అతనికి అర్థంకాలేదు. గురువులకు అంత్య కాలం సమీపించిందనే అతను భావించాడు.

"అయితే పిడుగు నెదిరిస్తావా?" అన్నాడు డాక్టర్.

'ఎదిరిస్తాను. నేను పిడుగును మట్టికరిపిస్తే నీ పెళ్ళాన్ని నాకప్పగిస్తావా?" అనడిగాడు గురువులు. అతడిమాటలకు పిడుగు కూడా ఆవేశపడ్డాడు.

"ఇంక లాభంలేదు. నా సహనానికి హద్దు నశించింది. పిడుగూ! నీకుతోచిన విధంగా వీడి పట్టుపట్టు. ప్రాణాలు మాత్రం తీయకు...." అన్నాడు డాక్టర్.

పిడుగు తానున్న స్థలంనుంచి కదిలాడు. అతడు కదుల్తూంటే హాలు అదురుతోంది. గురువులు తనవైపు వస్తున్న పిడుగునే శ్రద్ధగా గమనిస్తున్నాడు.

డాక్టర్, రామం, రమ–ముగ్గురూ కుతూహలంగా ఏంజరుగుతుందోనని చూస్తున్నారు. తన చెలికాని పని అయిపోయిందని రామం అనుకుంటున్నాడు. గురువులు పీడ ఈనాటితో సరి అని డాక్టర్ అనుకుంటున్నాడు.

కర్మం కాలి గురువులు నెగ్గితే తనపని ఏమవుతుందని రమ కంగారు పడుతోంది. యుద్ధానికీ, ఆమె అభిమానికీ సంబంధముందిమరి!

పిడుగు చేతులు చాపి గురువుల్ని సమీపించాడు. గురువులు అతడికి అందకుండా కొద్దిగా వంగాడు. గురువులినందుకోవడానికి పిడుగుకూడా వంగాడు. గురువులు మెరుపులా అక్కడ్డించి పక్కకు తప్పుకుని గాలిలోకి ఎగిరి పిడుగు వీపుమీద బలంగా తన్నాడు కాళ్ళతో.

ఊహించని ఈ దెబ్బకు పిడుగు బోరగిల పడిపోయాడు. అతడి ముందు పళ్ళు రెండు విరిగాయి. అంతటి మహాకాయం ఒక్కసారి నేలకూలేసరికి ఓ పట్టాన లేవలేకపోయాడు.

ఈలోగా గురువులు పిడిగు వీపుమీద ఓచిన్న తాండవ నృత్యం చేశాడు. ఆ నృత్యం కారణంగా పిడుగుకు కదలడానికి మరింత కష్టమైంది. గురువులు తన నృత్యన్ని ఒక్కనిముషం సాగించి హఠాత్తుగా ఆగి పిడుగు భుజాలమీద మెరుపు వేగంలో రెండు దెబ్బలు వేసి క్రిందకు దిగాడు.

''డాక్టర్-పిడుగులేవడానికింకో అరగంట పడుతుంది. ఆ సంగతి తర్వాత చూసుకుందాం. నీ పెళ్ళాన్ని నాకు అప్పగించు....'' అన్నాడు గురువులు.

గురువులి ప్రతాపానికి రామం ఆశ్చర్య పోయాడు. డాక్టర్ వణికి పోయాడు.

డాక్టర్ భార్య రమ హడిలిపోతూ-అప్రయత్నంగా గురువులి ముందుకు వచ్చి-చేతులు జోడించి దణ్ణం పెట్టి-"అన్నలాంటి వాడివి-నన్ను రక్షించు.... అంది.

'నీ మొగుడు పిడుగును నా మీద ఉసిగొల్పినప్పుడు నేను నీకు అన్నలాంటి వాడినని గుర్తుండి ఉండదు. పిడుగు నన్ను హింసిస్తూంటే చూసి ఆనందించాలను కున్నావు. వాడు మట్టి కరవగానే నన్ను అన్నలాంటి వాడినంటూ వచ్చావు. చాలా గొప్ప సంస్కారం నీది-' అంటూ ఆమె చేయి పట్టుకున్నాడు గురువులు.

డాక్టర్ ఉద్రేకంగా లేవబోయాడు. గురువులు చటుక్కున ఆమెను వదలి డాక్టర్ వద్దకు వెళ్ళి అతని ముక్కుకు ఏదో వాసన చూపించాడు. డాక్టర్ ఉన్న పళంగా కుర్చీలో కూలబడి పోయాడు.

'రామం-నువ్విక్కడే కూర్చుని ఉండు....' అన్నాడు గురువులు- 'డాక్టర్! ఇప్పుడు నువ్వు వాసన చూసిన మందు నువ్వు తయారు చేసినదే. ఇది వాసన చూపించి మనుషులను నిర్వీర్యుల్ని చేసి డెయ్యాల పేరుతో బెదిరించే వాడు ప్రెసిడెంటు. ఒకప్పుడు నువ్వు ఒక శ్రామికుడి భార్యనిదేవిధంగా అవమానించావు. నీకూ ఆ అవమానం తప్పదు. నేనా గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంటాను. నువ్వలా చూస్తూ ఉండు...." అన్నాడు గురువులు.

డాక్టర్ కదలాలనుకున్నాడు. కదల లేక పోయాడు. ఏదో అనాలనుకున్నాడు. అనలేక పోయాడు. రామం వంక చూశాడు. రామం అతనికి సహాయపడేలా లేడు.

గురువులు, డాక్టర్ భార్యను బలవంతంగా ఓ గదిలోకి లాక్కుని వెళ్ళి తలుపులు వేసుకున్నాడు.

* * *

'మనం మళ్ళీ ఇలా సమావేశమవుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది....' అన్నాడు గురువులు.

'మా హెచ్చరిక సంగతి ఏం చేశావు?' అన్నాడు ప్రెసిడెంటు.

'నేను రంగంలోకి దిగాను. ఏం జరిగిందో చెప్పమంటె చెబుతాను...' అన్నాడు గురువులు.

'చెప్పు....' అన్నాడు ప్రెసిడెంటు.

'ఒక స్త్రీ చెరచబడింది... '

ఉలిక్కి పడ్డారు చాలా మంది పెద్దలు - 'ఎవరామె?' అన్నాడు ప్రెసిడెంటు.

''మీ పది మందిలో ఒకరి భార్య!'' అన్నాడు గురువులు.

డాక్టర్ మౌనంగా తలవంచుకున్నాడు.

గురువులు మళ్లీ అన్నాడు—'నా కార్యరంగంలో ఇది మొదటి మెట్టు. తరువాతి చర్యలింకా చాలా ఘోరంగా ఉంటాయి....'

'నీ మాటలు నమ్మి బెదిరి పోతామనుకోకు....' అన్నాడు ప్రెసిడెంటు.

నా మాటలు నమ్మాల్సిన అవసరమున్నదో లేదో, ఆ తల వంచుకుని కూర్చున్న డాక్టర్ గారిని అడగండి...' అన్నాడు గురువులు.

'ఏం జరిగింది? ఎలా జరిగింది?' అన్నాడు ప్రెసిడెంటు కంగారుగా. డాక్టర్ ముఖం చూడగానే ఆయనకు అనుమానం కలిగింది - ఏదో జరిగే ఉంటుందని

'చెప్పు డాక్టర్! లేకుంటే సాక్ష్యాలతో సహా ఊరంతా ప్రచారం చేసేస్తాను ఇప్పుడు చెబితే ఈ పెద్ద మనుషుల మధ్య నీ రహస్యం భద్రంగా ఉంటుంది - ' అన్నాడు గురువులు.

'ఇందులో రహస్యానికింకా తావెక్కడుంది? నా బ్రతుకెలాగూ హీనమై పోయింది....' అన్నాడు డాక్టర్.

"పాపం - అందరికీ తెలిసేకకూడా ఆ సూరయ్యకూడా తన బ్రతుకు వెళ్ళబుచ్చడం లేదూ - వాడూ మనిషే, నువ్వూ మనిషే! దానికేం ఫరవాలేదు కానీ జరిగింది చెప్పు....'

డాక్టర్ నెమ్మదిగా జరిగినది చెబుతూంటే అందరూ భయభ్రాంతులై విన్నారు. పిడుగును ఒక్క క్షణంలో మట్టి కరిపించేదంటే గురువులు సామాన్యుడై ఉండడని వారందరకూ అనిపించింది. ఇదంత సామాన్య వ్యవహారం కాదని ప్రెసిడెంటుక్కూడా అనిపించింది.

పదిమందీ కాసేపు చర్చలు జరిపారు. కాస్సేపయ్యాక 'మాకు మరో రోజు గడువు కావాలి...' అన్నాడు ప్రెసిడెంటు.

నేను గడువిస్తే అక్కర్లేదన్నారు, పైగా నాకే గడువిచ్చారు. ఇప్పటికి నన్ను గడువు అడిగేస్థితికి వచ్చారు. ఫరవాలేదు. రేపైనా ఆటవికులవద్దకు దారి చెప్ప గలరని ఆశిస్తాను...." అన్నాడు గురువులు.

అందరూ విడిపోయారు. గురువులు తన గదిలోనికి వెళ్ళిపోయాడు. రామం అతడిననుసరించాడు. అతడికిప్పుడు గురువులు అంటే చాలా భయంగా ఉంది.

"రామం! నిన్ను తోడుగా తీసుకొని వచ్చినప్పుడు నీ తాత నాకు సరియైన సమాచారం ఇవ్వడం కోసం మాత్రమే ఉపయోగిస్తావనుకున్నాను. నీ కారణంగా నేను త్వరగా పనులు పూర్తిచేసుకోలేనేమోననుకున్నాను. కానీ నువ్వు నాకింత బాగా ఉపయోగపడ

గలవని నేననుకోలేదు.నీ బుర్రలో ఇంతటి అమోఘమైన తెలివితేటలున్నాయని అనుకోలేదు-'అన్నాడుగురువులు.

రామం ఆశ్చర్యంగా ముఖం పెట్టి-"ఏమిటి నువ్వు గ్రహించిన ఆ తెలివి తేటలు?' అన్నాడు.

"అలా ఆశ్చరాన్ని ప్రకటించకు. నాకు తెలుసు నువ్వు మంచి నటుడివని. నీ నటనా సామర్థ్యాన్ని నిన్న రాత్రి లేవి కడుపునొప్పి అభినయించే టప్పుడే చూశాను నిన్న వాళ్ళందర్నీ బెదిరించి నప్పుడు డాక్టర్ దురాగతాన్నభి వర్ణిస్తూ ఒక కథ చెప్పాను. ఆ కథచెప్పడం లోని నా సూచననెలా అర్థం చేసుకున్నావో నువ్వు కడుపు నొప్పినటించి డాక్టర్ ఇంటప్రవేశించావు. నువ్వు క్కడ లేకపోతే ఆ ఇంటికివెళ్ళడానికి నాకు సరైన వంక లేకపోయేది. నువ్వున్నావు కాబట్టే నేను డాక్టర్ ఇంటికి వెడుతూంటే పెద్దలెవ్వరికి అనుమానం కలగ లేదు. ఆఖరికి డాక్టర్ కి గూడా.నాప్లాను విజయవంతం అయింది. నీకు చాలాచాలా థాక్సుఅన్నాడు గురువులు.

రామానికి ఏం జవాబు చెప్పాలో తోచలేదు. గురువులకింకా నా మీద దురభిప్రాయం కలగకపోవడం- నాఅదృష్టం- అనుకున్నాడు రామం.

* * *

మర్నాడుదయం గురువులూళ్ళోకి వెళ్ళిపోగానే ప్రెసిడెంటు రామాన్ని నిష్ఠూరాలాడాడు- "నాకు తెలుసు." నువ్వు మా మనిషిగా నటిస్తూ అతనికి సాయపడుతున్నావు-" అన్నాడాయన.

ఆ అవసరం గురువులుకు లేదు. అతడు నేను లేకపోయినా తన పనులు సాధించుకో గలడు. కానీ ఒక చిన్న సందేహం? మీరతనికా నిధిరహస్యం ఎందుకు

చెప్పరూ? అన్నాడు రామం.

'నిధీ లేదు పాడూ లేదు. ఉంటే ఎందుకుచెప్పం ? "
అన్నాడు ప్రెసిడెంటు.

"ఉందని అతనంటాడు. లేదని మీరంటారు. మధ్య నేను చస్తున్నాను."

అన్నాడు రామం.

" నయానా భయానా నాదగ్గర్నుంచి ఆ రహస్యం లాగాలని చూస్తున్నారు మీరు. అది చెప్పడం జరగదు! '
అన్నాడు ప్రెసిడెంటు.

రామం ఆశ్చర్యంగా — "అయితే ఆ అపూర్వనిధి ఉందా!" అన్నాడు.

'ఉందో లేదో చెబుతాను. నీకు ఆ నిధిని గురించి తెలుసుకోవాలని ఉంది కదూ — ఆ గురువులితో కలిసి దాని గురించి బయల్దేరాలనుకుంటున్నావు కదూ — నిజం చెప్పు.... 'అన్నాడు ప్రెసిడెంటు.

'లేదు.... అన్నాడు రామం....' నాకానిధిపై నమ్మకం లేదు. గురువుల్ని వదుల్చుకుందామనే నా ఉద్దేశ్యం. మా ఊరు ఎంతత్వరగా చేరితే అంతసంతోషిస్తాను...."

'సరే అయితే నిజంచెబుతున్నాను. నిధి విషయం చెప్పలేనుగానీ ఇక్కడికి సమీపంలో ఉన్న ఆటవికుల ప్రాంతానికి దారి తెలుసునాకు. ఆ ప్రకారంవెడితే తప్ప సురక్షితంగా ఆ ప్రాంతం చేరుకోడం అసాధ్యం. ఈ ఊరి మునసబుగారింటిలోంచి కొండల్లోకి ఒక సొరంగ మార్గముంది. —అదిచూపిస్తాను నువ్వు వాళ్ళింటిలో కొచ్చావంటే!' అన్నాడు ప్రెసిడెంటు.

రామం కళ్ళు విప్పారాయి. మొత్తంమీద ఒక పెద్ద రహస్యం ఇన్నాళ్ళకు బయటపడుతోంది. ఈ రహస్యం

తనకెంతవరకూ ఉపయోగపడుతుందన్నది ముఖ్యంకాదు. గురువుల వీరోచిత చర్యలు చూశాక అతడితోపాటు వెళ్ళాలన్న కోరిక నానాటికీ అధికమవుతోంది.

అయితే ఎప్పుడు చూపిస్తారు.? అన్నాను ఆత్రుతగా.

నువ్వుకోరుకుంటే— ఇప్పుడే। అన్నాడు ప్రెసిడెంటు।

"అయితే నేను రెడీ।" అన్నాడురామంఅతనికి చాలా ఆత్రుతగా ఉంది.

ప్రెసిడెంటు అతణ్ని రహస్య మార్గం చూపించ డానికి మునసబు ఇంటికి తీసుకుని బయల్దేరాడు.

రామం ఆలోచనలవిందా ఆ రహస్య మార్గమే ఉంది. గురువుల్ని వదిలి ప్రెసిడెంటు ఆ రహస్యమార్గాన్ని తన కెందుకు చూపాలనుకొంటున్నాడో ఆలోచించలేదు.

ప్రెసిడెంటు చనువుగా మునసబు ఇంట్లో ప్రవేశిం చాడు. రామం ఆయన్ననుసరించాడు. మునసబు ఇంట్లో లేడని ఆయన భార్య చెప్పింది. దొడ్లో తనకు పని ఉందన్నాడు ప్రెసిడెంటు.

రామం, ప్రెసిడెంటు కలిసి మునసబు ఇంటి దొడ్లోకి వెళ్ళారు. అక్కడ ఓ చిన్న అరుగుమీద ఓ మనిషి కూర్చుని ఉన్నాడు. రామం ఆ మనిషిని చూడలేదు.

ఇదిగో రామం - ఆ మనిషిని చూడు-, అన్నాడు ప్రెసిడెంటు.

రామం ఉలిక్కిపడి ఆ మనిషిని చూశాడు. చూసేక మరింత ఉలిక్కిపడ్డాడు.

ఆ మనిషి పువ్వుల లుంగీకట్టుకుని ఉన్నాడు. ఎత్తు ఆరడుగులకు పైగా ఉంటుంది. నల్లటి శరీరం-నూనె

రాసినట్లుగా మెరుస్తోంది. ' కండలు మెలికలు తిరిగి ఉన్నాయి, ఇంగ్లీష్ సినిమాల్లో శాంసన్‌లా ఉన్నాడు. రామాన్ని చూస్తూనే ఆ మనిషి లేచి నిలబడ్డాడు. అతని మొలకు ఒక పటకా బెల్టుఉంది. అతనా బెల్టు విప్పిఎడమ చేతిలోకి తీసుకున్నాడు.

'వాడిది ఎడమ చేతి వాటంలే' అన్నాడు ప్రెసిడెంటు.

రామం పై ప్రాణాలు పైనే పోయాయి. హఠాత్తుగా అతడి మెదడు వేగంగా ఆలోచించసాగింది. తను ప్రెసిడెంటు వలలోపడి పోయనని గ్రహించాడు. అంతకు మునుపే గురువులు చేసిన హెచ్చరిక కూడా గుర్తుకు వచ్చింది.

'ప్రెసిడెంటును నమ్మకు. ఆయన నిన్ను చంపాలను కుంటున్నాడు. ఆయన విషయంలో చాలా జాగత్తగా ఉండాలి. ఆయనతో గానీ ఊరి పెద్దలతో గానీ ఒంటరిగా తిరక్కు-- అన్నాడు.

'ఎందుకని?

'నన్నేమీ చేయలేదనేది వాళ్ళు గ్రహించారు. నిన్ను సాధిద్దామను కుంటున్నారు. మనిద్దర్నీ విడదీసి ముందు నిన్ను, ఆ తర్వాత నన్ను చంపాలని వాళ్ళ పథకం-,

"దానికి నువ్వేం చేద్దామనుకుంటున్నావ్ ?"

"నిన్నూ నన్ను కాపాడుకురావడం కష్టం. నా సంగతి నేను చూసుకుంటాను. నువ్వు కూడా నీ జాగ్రత్తలో నువ్వుండు-" అన్నాడు గురువులు.

నిజంగానే దురదృష్టం తన్నువెంటాడింది.

"ఏమిటిదంతా?" అన్నాడు రామం కంగారుగా.

"ఏమీలేదు. నువ్వు అలాచూస్తుండు. జరగాల్సింది

జరుగుతుంది....." అంటూ ప్రెసిడెంటు ఆ మనిషి వంకచూసి- "సిద్ధంగా ఉన్నావా" అనడిగాడు.

"చిత్తం!"

"అయితే ఇతన్ని ఆ రేకులషెడ్లోకి తీసుకువెళ్ళు. నా అంతటి వాడితో ఆటలాడాలని చూసిన ఘటికుడితను. కాబట్టి నీకు తోచినంతసేపు ఇతనితో ఆడుకో. ప్రాణా లెంత ఆలస్యంగాపోతే అంత బాగుంటుంది అట-నీ సరదా తీర్చుకో-" అన్నాడు ప్రెసిడెంటు.

ఆ మనిషి ముందుకువచ్చి కుడిచేత్తో రామం చేయి పట్టుకున్నాడు. రామం ఆపాదమస్తకం వణికిపోతూ- "ప్రెసిడెంటుగారూ, ఇదిచాలా అన్యాయం. మీకు నేను సాయపడాలని ఎంతగానో ప్రయత్నించాను. అదృష్టం కలిసిరాలేదు. నాకింత ఘోరశిక్ష విధించడం న్యాయం కాదు...." అన్నాడు.

"నువ్వింకేమీ మాట్లాడకు. ఆదేవుడుకూడా నిన్ను క్షమించడు, రక్షించడు...." అన్నాడు ప్రెసిడెంటు.

ఆ మనిషి రామాన్ని బరబరా ఈడ్చుకుంటూ రేకుల షెడ్లోకి వెళ్ళాడు. రేకుల షెడ్డుకు ఓ సన్నని ప్రవేశ ద్వారం ఉంది. చుట్టూ రేకులు. పైన టాపు లేదు. మునసబుగారు దాన్ని బందుల దొడ్డిగా ఉపయోగిస్తూంటాడు

రామం ఆర్తనాదాలు వినడడంకోసం ప్రెసిడెంటు సిద్ధంగా ఉన్నాడు. ఆయన మనసు కసితో ఆవేశపడి పోతోంది. ప్రెసిడెంటు వింటూండగా కెవ్వుమన్న కేక వినిపించింది. అయితే అది ఒకచే కాదు. రెండు

కంతాలు. ప్రెసిడెంటు ఆశ్చర్యంగా రేకుల షెడ్డు వైపు తిరిగాడు.

ఆయనింకా రెండడుగులు వేయకుండానే షెడ్లోంచి రామం, ఆ అరడుగుల మనిషి బయటకు వచ్చారు. ఇద్దరు వణికిపోతున్నారు.

'ఏం జరిగిందిరా—అలా వణికిపోతున్నావ్?' అన్నాడు ప్రెసిడెంటు.

'తమరొక్కసారి లోపలకు రండి .... ' అన్నాడు వాడింకా వొణికి పోతూనే.

ప్రెసిడెంటు రేకులషెడ్లో అడుగు పెట్టాడు. అక్కడ ఆయన చూపిన దృశ్యం ఎంతటి ధైర్యవంతుణ్నయినా నిశ్చేష్టితుణ్ని చేస్తుంది.

అక్కడ మునసబు నేల మీద పడి ఉన్నాడు. వంటి మీద చిన్న పంచె మినహాయించి ఏమీ ఆచ్ఛాదన లేదు. ఒడలంతా దెబ్బలతో కమిలిపోయి ఉంది. అక్కడక్కడ చర్మం చిట్లి రక్తం ధారలుగా కట్టింది. కళ్ళు రెండూ తెరచి ఉన్నాయి. చూపులు భయంకరంగా ఉన్నాయి. చేతులు రెండూ వెనక్కి విరచి కట్టబడ్డాయి. నోట్లో కూడా గుడ్డలు కుక్కబడి ఉన్నాయి.

అంటే ఎవరో మునసబు నోట్లో గుడ్డలు కుక్కి చేతులు కట్టేసి నిస్సహాయుణ్ని చేసి గొడ్డును బాదినట్లు చావ బాదారన్న మాట!

ఇప్పుడు మునసబు శరీరంలో ప్రాణం లేదు.

మునసబు శవాన్ని చూసి, అప్రయత్నంగా తనూ 'కెవ్వు'మని అరిచాడు ప్రెసిడెంటు.

* * *

'నాలో కరుణ లేదు. నాకు హృదయం లేదు. నా లక్ష్య సాధన కోసం ఏమైనా చేస్తాను. పది మందల్లా తొమ్మండుగురయ్యారు. ఈ రోజు నుంచి లెక్కపెట్టు కోండి. రోజు కొకరు తగ్గిపోతారు .... ' అన్నాడు గురువులు.

పెద్దలు తొమ్మండుగురూ కంగారుగా ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

గురువులు వాళ్ళ కళ్ళలో రాక్షసుడిలా కనపడ సాగాడు.

'మీరేం సామాన్యులు కారు. నన్ను పట్టుకో డానికి రకరకాలుగా యత్నిస్తున్నారు. పోలీసుల్ని పిలిపించారు. పిడుగు చేత చంపించాలనుకున్నారు. నా రామాన్ని అమానుషంగా చిత్రహింస చేయాలనుకున్నారు. కానీ ఒక్కడాంట్లోనూ దేవుడు మీకు సాయపడలేదు. అంటే అర్థం న్యాయం మీ పక్షాన లేదన్న మాట? ఈ ఊళ్ళో రోజుల తరబడి నా సమయం వృధా అయిపోతోంది. ఇంక చివరి అస్త్రాన్ని ప్రయోగించక తప్ప లేదు—'అన్నాడు గురువులు.

'ఇలాంటి వాడికి లొంగ కూడదు. వీణ్ని ప్రజల ముందు నిలబెట్టాలి—' అన్నాడు ప్రెసిడెంటు.

'ఎవరు నీ ప్రజలు? ఎక్కడున్నారా ప్రజలు? నీకు తెలుసో తెలియదో-నీ ఇనప్పెట్టె లోంచి లక్షరూపాయలు తీసి ఈ ఊరి పేద ప్రజలకు పంచిపెట్టాను. వాళ్ళంద రితో మాట్లాడేను. నీ ఘోరాలను వాళ్ళు సహించే రోజులు పోతున్నాయి. నాలాంటి మనిషి ఒక్కడు సాయముంటే నీ బ్రతుకును నేలమట్టం చేస్తామని వాళ్ళంటు

న్నారు. మునసబు చచ్చేరని తెలిస్తే ఊరంతా పండుగ చేసుకుందామనుకుంటోంది. నేనొక్క ఈల వేస్తే వంద మంది ఈ ఇంటి చుట్టు పక్కలలో నిలబడతారు. కావా లంటే ఈలవేస్తాను....” అంటూ గురువులు శక్తి కొద్దీ ఈలవేశాడు. తర్వాత- “ఇప్పుడు వెళ్ళి ఈ ఇంటి చుట్టు ఎందరున్నారో లెక్కపెట్టుకుని రండి- అన్నాడు.

పెద్దలందరూ ఇంటి బయటకు వెళ్ళారు.

వాళ్ళలా వెళ్ళగానే - ‘అన్నీ తెలుసన్న మాటనీకు. నా ప్రాణాలు కాపాడావు నువ్వు. నీకు కృతజ్ఞతలెలా చెప్పుకోవాలో తెలియడం లేదు-’ అంటూ గురువులు చేయిపట్టుకున్నాడు రామం.

‘రామం-నువ్వు తెలివైన వాడివే కానీ - లోకజ్ఞానం చాలదు. అనుకున్నది చేయడానికి ఎత్తులు బాగా వేస్తావు కానీ ఎదుటి వాళ్ళు నీ మీద ఎప్పుడు దెబ్బ తీయాలను కుంటున్నారో ఊహించలేవు. నిన్ను ఓ మనిషి చేత బెల్టుతో చావగొట్టించడానికి మునసబు ఏర్పాటు చేస్తు న్నట్లు నిన్ననే నాకు తెలిసింది.

ఏమనిషైతే నిన్ను కొట్టాలనుకుంటున్నాడో ఆ మనిషి ఇంటి నుంచి వాడి పటకా బెల్టు ఎత్తుకొచ్చి మునసబు ఇంటికి వెళ్ళాను. దొడ్లో ఆయన ఒంటరిగా తటస్థ పడ్డాడు. నోరునొక్కి షెడ్లోకిలాక్కుపోయి వెళ్ళాను. చేతులు విరిచి కట్టేసాను. నోట్లో గుడ్డలు కుక్కాను. చావబాదేశాను. చచ్చాడు. అక్కణ్ణుంచి ఆ బెల్టు తీసు కుని వెళ్ళి మళ్ళి ఆ మనిషి ఇంట్లో పెట్టి నీ దగ్గరకు వచ్చాను,

ప్రెసిడెంటు నిన్ను తీసుకెళ్ళాడు. చాటుగా అంతా

గమనిస్తూనే ఉన్నాను. నీ వంటి మీద ఈగ వాలినా ఆ మనిషి అంతు చూడాలనుకున్నాను. అయితే అలా జరగలేదు. ప్రెసిడెంటు షాక్ తిన్నాడు. ఆ షాక్‌లో అన్నీ మర్చి పోయాడు. అందుకే అప్పుడు నేను మీ మధ్యకు రాలేదు. ఇంక రహస్యం బయటపడే క్షణం దగ్గరవుతోంది-, అన్నాడు గురువులు.

రామం ఆశ్చర్యంగా గురువులు వంక చూస్తూన్నాడు. ఒక దారుణ హత్యను చేసిన మనిషిగా అతను రామం కంటికి కనబడ్డం లేదు. తన ప్రాణాలు కాపాడిన దేవతగా ఒక మహాత్ముడిలా కనబడతున్నాడు. పాప పుణ్యాలనూ, మంచి చెడ్డలనూ నిర్ణయించేది స్వార్థమే గదా ఈ ప్రపంచంలో!

పెద్దలు వీధిలోంచి బయటకు వచ్చారు. అందరి ముఖాల్లోనూ కంగారు కనబడుతోంది.

"చూశారా ?" అన్నాడు గురువులు.

ఒక భూస్వామి గురువులు వంక చూసి-"ఇంతమంది జనాన్ని ఈ ఊరి పెద్దలకు వ్యతిరేకంగా ఎలా కూడగట్టావోయ్ గురువులూ !" అన్నారు.

గురువులు నవ్వి - 'పదవులు అహంకారాన్నిస్తే దాంతో కళ్లు మూసుకుపోతే మనమేం చేసినా ప్రజలు వహిస్తారని భ్రమపడితే ఆ నాయకుల్ని పడగొట్టడానికి నాలాంటివాడు ఒక్కడు చాలు. అందుకు రాజకీయపుటనుభవం అక్కర్లేదు. మంచి అక్కర్లేదు. విసిగిపోయిన ప్రజలు పాత నాయకుల్ని పడగొట్టడానికి ఏమైనా చేస్తారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం విషయంలో జరిగినదే నీ విషయంలో జరిగింది....' అన్నాడు.

పెద్దలంచరూ తగ్గుస్వరంలో సమాలోచనలు జరిపారు. వారిలో నలుగురైదుగురు బాగా భయపడ్డారు. గురువులు అన్నంత పనీ చేస్తాడనీ, చేయగలడనీ అందరికీ నమ్మకం కలిగింది.

'ఆటవికులలో శత్రుత్వం ఏర్పడితే చాలా ప్రమాదం' అన్నాడు ప్రెసిడెంటు.

'అలా ఎందుకు? వీళ్ళని మన మనుషులుగా నిధిలో పని చేయడానికి మనం ఎన్నుకున్నామని పంపిస్తే సరిపోతుంది -' అన్నాడు గ్రామ పురోహితుడు.

'వీళ్ళను నిధి దాకా చేరనిస్తే చాలా ప్రమాదం. వాడసలే గుండెలు తీసిన బంటు. అప్పుడు మన ఊరికే ప్రమాదం -' అన్నారు ప్రెసిడెంటు.

'వీళ్ళిక్కడుండడం కూడా ఊరికి ప్రమాదకరంగానే ఉంది. అలగా జనాన్ని మన మీదకు రెచ్చగొడుతున్నాడు. ఊళ్ళో మనకు విలువ లేకుండా చేస్తున్నాడు' అన్నాడు కరణం.

'ఈ విషయంలో మన మిత్రులిక్కడికి సాయుధంగా ఎందుకు రాకూడదు? వీళ్ళ ఆట క్షణాల మీద కట్టవుతుంది' అన్నాడు ఓ డాక్టరు.

'అలా కుదరదు. మన మిత్రులేపరిస్థితుల్లోనూ సాయుధులై ఈ ప్రాంతాలకు రారు. ప్రమాదకరమైన పరిస్థితులుగానీ ఎదురైతే ఆ విషయం చూసుకోవడానికి అటవికులున్నారు. ఎవరైనా తెగించి నిధి ప్రాంతాలకు వెడితే ఆ విషయం మనం కాస్త ముందుగా తెలియపరిస్తే చాలు. నిజం చెప్పాలంటే వీళ్ళ విషయం ఇంతవరకూ మన మిత్రులకు తెలియబచ్చలేదు. ఇద్దరు మనుషుల్ని

మనవేమీ చేయలేకపోయామంటే వాళ్ళ దృష్టిలో మనం బాగా లోకువై పోతాం-' అన్నాడు ప్రెసిడెంటు.

"అయితే ఏం చేద్దామంటారు ?" అన్నాడు ఓ షాహుకారు.

'మీరంతా చెప్పిందే - వీళ్ళను అటవికుల ప్రాంతానికి చేర్చడం. మన మామూలు పద్ధతి ప్రకారం అయితే స్పృహ తప్పించి అక్కడికి పంపేవాళ్ళం. ఇప్పుడలా చేయడానికి వీలు కాదు, గురువులు ఒప్పుకోడు. ఆ దారి వీళ్ళకు తెలియక తప్పదు....' అన్నాడు ప్రెసిడెంటు.

'ఆలస్యం-అమృతం-విషం- ఆ పని చేయండి. కానీ అక్కడికి వెళ్ళేరో అటవికులు వీళ్ళ పని పూర్తి చేసే ఏర్పాటు చేయాలి...' అన్నాడు గ్రామ పురోహితుడు.

'అవును-ఆ దారి తెలిసిన పరాయి వాళ్ళెవ్వరూ బ్రతికి ఉండరాదు-' అన్నాడు ఓ షాహుకారు.

"ఆ అటవికులను చేరిన వాళ్ళెవ్వరూ ఇంతవరకూ ప్రాణాలతో బయటపడలేదు-" అన్నాడు ప్రెసిడెంటు నర్మ గర్వంగా నవ్వి.

"మన ఎరికలో అని అనండి-" అంటూ సవరించాడు కరణం.

ప్రెసిడెంటు చురుగ్గా కరణంవంక చూసి- "నాకాఅటవికుల గురించి బాగాతెలుసు. ఇంతవరకూ ఎవ్వరూ అక్కణ్ణించి బయట పడలేదు. ఇప్పుడూ అదే జ-ుగుతుంది-" పెద్దలు గురువుల్ని పిలిచి: "అటవికుల ప్రాంతానికి చేరడానికి నీకు దారిచెప్పడానికి నిర్ణయించాం. అయితే వాళ్ళు చాలా ప్రమాదకరమైన వ్యక్తులు. ఆ తర్వాత జరిగే కష్ట నష్టాలకు పూర్తిగా మీరే బాధ్యులు...." అన్నారు.

"అవన్నీ నేను చూసుకుంటాను. కానీ ఆటవిక ప్రాంతాన్ని చేరుకునే వరకూ మాకు తోడుగావచ్చే మని షితోపాటు కరణంగారి మనవడూ, ప్రెసిడెంటు గారి మనవడూ కూడారావాలి–" అన్నాడు గురువులు.

ప్రెసిడెంటు, కరణాల ముఖాలు మాడిపోయాయి.

"ఆ పసిపిల్లలెందుకు? నీకుమేము తప్పుదారి చెబుతామా?" అన్నాడు ప్రెసిడెంటు.

"మనం పరస్పరం శత్రువులం. అందువల్ల ఒకరి నొకరు నమ్మే ప్రసక్తి లేదు. మీ పిల్లలు మాదగ్గరు న్నంత సేపూ దారిగురించి నాకేబెంగా అవసరముండదు.. అదీసంగతీ–" అన్నాడు గురువులు.

"ఆ తర్వాత మాపిల్లలుమాకు సురక్షితంగా చేరు తారని నమ్మకమేమిటి?" అన్నాడు కరణం.

"నువ్వు చెప్పేదారి సరైనదయితే ఎలాగూ సురక్షి తంగా చేరతారు. నీ మిత్రులైన ఆటవికుల దగ్గరికి గదా నేను వెడుతున్నాను. మీ పిల్లలకేమైనా చేస్తేవాళ్ళ నన్ను బ్రతుకనిస్తారా?" అన్నాడు గురువులు.

"సరే– అలాగే చేద్దాం–" అన్నాడు ప్రెసిడెంటు.

"మరొక్క షరతు...." అన్నాడు గురువులు. "మీ ఊరి పెద్దలందరూ సంతకాలుచేసి ఆటవిక నాయ కుడికో కాగితం రాయాలి. అందులో నేను, రామం అక్కడికి వస్తున్నట్లు, మేము మీ మిత్రులమైనట్లూ మమ్మల్ని సకల మర్యాదలతో అపూర్వనిధి ప్రాంతానికి పంపించ వలసిందని రాయాలి–"

ప్రెసిడెంటు తీవ్రాలోచనలో పడ్డాడు. అలా కాగితం రాసివ్వడం ఆయనకిష్టంలేదని ముఖం చూసి తెలుసుకో

వచ్చు. అయితే కొద్దిసేపట్లోనే ఆయన కళ్ళు ప్రకాశవంతమయ్యాయి.

"సరే గురువులు! అలాగే చేస్తాం. ఎటొచ్చీ అందుకు మీ ఫోటోలు కావాలి. ఈ ఫోటోలో మనుషుల్ని-అని స్పష్టంగా రాస్తేతప్ప వాళ్ళకు ఏ విషయమూ తెలియదు....' అన్నాడు ప్రెసిడెంటు.

ఫొటోల అయిడియా గురువులకు నచ్చింది. అతను అంగీకరించగానే డాక్టర్ తన ఇంటికివెళ్ళి కెమేరా తీసుకొని వచ్చాడు. గురువులుకు, రామానికి అతను ఫొటోలు తీశాడు.

"సిద్ధంగా ఉండండి-రేపే మీ ప్రయాణం!" అన్నాడు.

*　　　*　　　*

కొండ ప్రాంతానికి ఎందరో రాలేదు. ప్రెసిడెంటు, కరణం, ఓ ఆటవికుడు మాత్రం వచ్చారు. గురువులు కరణంగారి మనువణ్ణెత్తుకున్నాడు. రామం ప్రెసిడెంటు గారి మనువణ్ణెత్తుకున్నాడు. తన మనవణ్ణి గురువులు చేతిలో చూస్తూ కరణం వణికిపోతున్నాడు.

అంతా కలిసి రాళ్ళలో తుప్పల్లో కొంత దూరం నడిచి ఒకచోట ఆగారు.

"ఈ పక్కనుంచి కొంతదూరం వెడితే ఒక గుహ వస్తుంది. ఆ గుహలోంచి కొంతదూరం నడిస్తే ఒక అరణ్యంలోకి దారి తీస్తుంది. అలా గుహలూ, అరణ్యాలూ దాటుకుంటూ రాత్రిదాకా ప్రయాణం చేస్తే ఆటవీకుల ప్రాంతం వస్తుంది. ఈ ఆటవికుడికొక్కడికే అన్ని దారులూ బాగా తెలుసు. ఇతడు చాలామందిని తీసుకునివెళ్ళాడీదారిలో. కానీ తిరిగివచ్చింది మాత్రం

ఇతనొక్కడే!'' అన్నాడు ప్రెసిడెంటు.

"ఈ హెచ్చరిక ఇచ్చేముందు మీ పిల్లలు మా దగ్గరున్నారని గుర్తుంచుకోండి-" అన్నాడు గురువులు.

ప్రెసిడెంటుకానీ కరణంగానీ ఏమీ మాట్లాడలేదు. జాలిగా తమ పిల్లలవంక చూశారు.

వాళ్ళిద్దరికీ పది సంవత్సరాల వరకూ ఉండవచ్చు కుర్రాళ్ళ ముఖాల్లో ఎక్కడా భయం కనబడ్డంలేదు. చాలా చాలాకీగా ఉన్నారు. ఒక కొత్త ప్రాంతం చూడబోతున్నామనీ, అక్కడ సినిమాల్లో చూసేలాంటి ఆటవిక జాతి ఒకటి నివశిస్తున్నదనీ తెలిసివారికి చాలా ఉత్సాహంగా ఉంది.

"నీ పేరేమిటి?" అని గురువులు ఆటవికుడ్నడిగాడు.

"లక్ష్మణుడండి-" అన్నాడు ఆటవికుడు.

కరణంగారి మనవడు గోపీ, ప్రెసిడెంటుగారి మనవడు శంకర్-ఇద్దరూ తాతలకు ఉత్సాహంగా టా టా చెప్పారు. వాళ్ళ ఉత్సాహాన్ని చూస్తూ కళ్ళొత్తుకున్నాడు కరణం-"తండ్రీ వెంకటస్వామీ ఈ పిల్లలిద్దరూ ఏ ప్రమాదం లేకుండా వెనక్కి వచ్చేలా చూడు' - అంటూ దేవుడికి మొక్కుకున్నాడు.

లక్ష్మణుడు ముందు దారితీయగా గురువులు, రామం అతడి వెనుక నడిచారు. ఇప్పుడు గోపీ, శంకరం కూడా వాళ్ళతో పాటు నడుస్తున్నారు.

అలా కొంతదూరం నడిచేసరికి ఓ గుహ వచ్చింది. అంతా గుహలోకి ప్రవేశించారు. అది మనుషులు తయారు చేసిన గుహకాదు. కొండలమధ్య దానంతటది ఏర్పడింది. గుహ మరీ చీకటిగా లేదు.

'పాములూ, అవీ ఉంటాయా ?' అన్నాడు రామం.

'ఉండవు. వీటిలో మనుషులు చాలా తరచుగా సంచరిస్తూ ఉంటారు. మనుషులంటే వాటికీ చాలా భయం–' అన్నాడు లక్ష్మణుడు.

చిన్నపిల్లలకు వచ్చే సందేహాల్లాంటివి గోపి, శంకరం చాలా అడుగుతున్నారు. అన్నింటికీ లక్ష్మణుడు ఓపిగ్గా సమాధానాలు చెపుతున్నాడు.

అందరూ గుహలోంచి బయటకు వచ్చారు. ఎదురుగా పచ్చనిచెట్లు!

లక్ష్మణుడు ముందుకు దారితీస్తుంటే– "నువ్వు చాలా తరచుగా ప్రయాణం చేస్తుంటావా?" అనడిగాడు గురువులు. తాము నడుస్తున్న దారిని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడతను.

"అవునండి! ఈ దారంటే నాకు కొట్టినపిండి!" లక్ష్మణుడు గర్వంగా అన్నాడు.

మళ్ళీ కొండ గుహ. అంతా అందులో ప్రవేశించారు. ఇది కాస్త చీకటిగా ఉంది. గురువులు బ్యాటరీ లైటు వెలిగించాడు. ఈ గుహ ఇందాకటి దానిమీద ఇరుగ్గా ఉంది.

'ఈ దారి చాలా తమాషాగా ఉంది. ఎలా తయారు చేశారు!' అన్నాడు గురువులు.

'మేం తయారు చేయలేదు. వెతికి పట్టుకున్నాం. గంగాపురానికి దగ్గరదారి ప్రమాదాలు లేని దారి.... అన్నాడు లక్ష్మణుడు

'ఒక్క విషయం అడుగుతాను. మీ అటవికులు నాగరికతకు దూరంగా ఉండాలని ఎందు కనుకుంటున్నారు

మీరు మా అందరితోపాటు కలిసి ఉండొచ్చు గదా!

"మా ఆచారాలు వేరు నాగరకుల ఆచారాలు వేరు. మమ్మల్ని మూర్ఖులుగా తలుస్తారుమీరు. మీ ఆచారాలు కూడా చాలావరకు మూర్ఖంగానే ఉంటాయి. కానీ మీ దగ్గర బలం ఉంది కొత్తకొత్త ఆయుధాలున్నాయి. ఆకర్షణలున్నాయి. వాటి సాయంతో మమ్మల్ని లొంగదీసి జయించి మా ఆచారాలను మంటగలిపేస్తారని మా భయం. మా జీవితం మాకు బాగానే ఉంది. మా అలవాట్లనూ, ఆచారాలనూ నిలుపుకోవాలని మా తాపత్రయం. అందుకే మేము నాగరికతకు పైనంత దూరంగా ఉంటున్నాం-" అన్నాడు లక్ష్మణుడు.

రామం ఆశ్చర్యంగా అతడి మాటలు విన్నాడు. అందులో నిజముందనిపించింది. మంచియినా చెడ్డయినా ప్రతిజాతికి కొన్ని నమ్మకాలుంటాయి. ఆ నమ్మకాలను దెబ్బతీసేవారికి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తుంది ప్రతిజాతీకూడా.

'నాగరికుల్లో లేనివీ మీ జాతిలో ఉన్నవీ మంచి లక్షణాలేమిటి?" అన్నాడు రామం.

'చాలా ఉన్నాయి మాలో ఎక్కువతక్కువలు లేవు. అంతా సమానమే! మాకో నాయకుడుంటాడు. శక్తిని బట్టి నాయకుడవుతాడు. అందరికంటే శక్తి పంతుడు నాయకుడవుతాడు. మాలో మోసాలుండవు. అన్యాయా లుండవు. ఆడదాన్ని వంటింట్లో పెట్టి బంధించం. అందరికి స్వేచ్ఛ ఉంది. ఆడది పరాయి మగవాడి తో ఉంటే చెడిపోయిందనుకోము. ఆమె ఇష్టానికి విలువ ఇస్తాము. అందరికీ ఒకటే న్యాయం! మా జాతిలో

ఎవ్వరూ తిండి లేక మాడరు. కష్ట సుఖాలు సమిష్టిగా భరిస్తాం!' అన్నాడు లక్ష్మణుడు.

ఇవన్నీ చెబుతూంటే లక్ష్మణుడి కళ్లు మెరిశాయి. తన సంస్కృతి ఎంతో గొప్పదనీ, ఆ విషయాన్ని నలుగురు గుర్తించడం లేదనీ, వాడు భావిస్తున్నాడు.

గుహలోంచి మళ్ళీ పచ్చటి అరణ్యంలోకి వచ్చారు. వారి ప్రయాణం అలాగున సాగిపోతూనే ఉంది. చెప్పుకోదగ్గ సంఘటనలు లేవు. మధ్యలో ఆటవికుడు వారి కోసం మంచి మంచి ఫలాలు తెచ్చి ఇచ్చాడు. అక్కడక్కడ వారు తాగిన వాగుల్లోని నీరు అమృతంలా అనిపించింది.

'ఫలాలకు గానీ, నీటికి గానీ ఇటువంటి రుచి నాగరిక ప్రాంతంలో ఉండదు-' అన్నాడు లక్ష్మణుడు. అతడి మాటలు నిజమేనని అందరికీ అనిపించాయి. పట్నాలకు మించి పల్లెలు, పల్లెలకు మించి అడవులు-నివాసయోగ్యమైనవి. కానీ నాగరికత పట్నాలవైపే పరుగు తీస్తుంది. అందులో ఆశ్చర్యం లేదు. మనిషి జంతువులా మసల లేడు. అతడికి మేధ ఉంది. జంతువులరణ్యాల కోసం తపిస్తాయి. మనిషి పట్నాల కోసం తపిస్తాడు. అరణ్యంలో జీవించే మనుషుల విధానాల్లో జంతు విధానాలు గోచరిస్తాయి. పట్నంలో నివసించే మనుషుల జీవిత విధానాల్లో జంతు విధానా లుండవచ్చు కానీ అవి బహిరంగంగా అనిపించవు.

అంతా ఉత్సాహంగా ప్రయాణం చేయడంవల్ల, పాయంత్రానికే వారు ఆటవిక ప్రాంతాన్ని చేరుకున్నారు

(సశేషం)